క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలిసిన కార్మిక నేత



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పుష్పగుచ్ఛం అందజేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారానికి చెందిన కార్మిక నేత వరప్రసాద్ రెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పారిశ్రామికవాడల్లో కార్మిక సమస్యలు, తదితర విషయాలను కార్మిక నేత డిప్యూటీ సీఎంకు వివరించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చినట్లు వరప్రసాద్ రెడ్డి తెలిపారు.

అధిక ధరకు హెచ్‌పీ గ్యాస్ విక్రయం



గ్యాస్ కార్యాలయం వెనుక భాగంలో గ్యాస్ విక్రయాలను చూపుతున్న ఆనంద్ కృష్ణారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): నిబంధనలకు విరుద్ధంగా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం అధిక ధరలకు గ్యాస్‌ను విక్రయిస్తోందని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ఆనంద్‌కృష్ణారెడ్డి అన్నారు. హెచ్‌పీ గ్యాస్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం వెనుక భాగంలో రూ.100 అదనంగా వసూలు చేస్తూ గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి హెచ్‌పీ ఏజెన్సీ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెరువులను కాపాడుకుందాం



చెలికుంట పరిసరాలను శుభ్రం చేస్తున్న గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెలికుంట పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు శనివారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవ్ లేక్, సేవ్ వాటర్ ఉద్యమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెరువుల పరిసర ప్రాంతాల్లో ఎవరూ చెత్త వేయొద్దని కోరారు.

పాలక మండలి సభ్యులకు సన్మానం



మండల పరిషత్ పాలక మండలి సభ్యులను సన్మానిస్తున్న అధికారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): వచ్చే నెలలో మండల పరిషత్ పాలక మండలి సభ్యుల పదవీకాలం ముగుస్తున్నందునా వారిని అధికారులు, సిబ్బంది కలిసి శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజమ్మ, వైస్ ఎంపీపీ గౌసొద్దీన్, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పటాన్‌చెరు టౌన్: సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పటాన్‌చెరులో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కిషన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారిశ్రామికవాడ ఫేస్-1 , బండ్లగూడలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెసర సాగు.. రాబడి బాగు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు
- ప్రస్తుత కాలం.. సాగుకు అనుకూలం
- పెసర సాగుపై రైతుల ఆసక్తి
- సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏడీఏ భిక్షపతి సూచన



పెసర పంట

పెసర్లు ఆరోగ్యానికి విలువైన పోషకాలు అందిస్తాయి. పెసర్లు తీసుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేస్తుంది. అందుకని ప్రజలు ఎక్కువగా ఆహారంలో పెసర్లు తీసుకుంటారు. మార్కెట్‌లో కూడా మంచి డిమాండ్ ఉంది. ఖరీఫ్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను పొందవచ్చు. అంతేకాకుండా తక్కువ రోజుల్లోనే చేతికి వచ్చే పంట పెసర. ఈ పంట సాగుతో భూసారం పెరగడంతో పాటు ఆ తరువాత వేసే పంటకు నత్రజనిని అందిస్తుంది. వర్షాభావ పరిస్థితులేర్పడినప్పుడు రెండు తడులు ఇస్తే మంచి దిగుబడులు వస్తాయి. ఖరీఫ్ సీజన్‌లో పెసర సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ఏడీఏ భిక్షపతి సాగుకు అనువైన రకాలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

– జహీరాబాద్ టౌన్

సాగు విధానం

- పెసర స్వల్పకాలపు పంట. వర్షాధారంగా నీటి పారుదల కింద మూడు కాలాల్లోనూ సాగు చేస్తుంటారు. పంట సాగు చేయటానికి ప్రస్తుతం అనుకూలమైన సమయం. జూన్ 15 నుంచి జులై 15 వరకు విత్తుకోవచ్చు. అన్ని రకాల భూముల్లో పండుతుంది.
- చౌడు, ముురుగు నీరు నిలిచే పొలాలు సాగుకు పనికిరావు. వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పుడు 25 రోజుల నుంచి 30 రోజుల్లో ఒకసారి, 45 రోజుల నుంచి 50 రోజుల దశలో మరోసారి తేలికపాటి తడులు ఇవ్వాలి.
- పంట రకాన్ని బట్టి 60-70 రోజుల్లో అధిక శాతం కాత ఎండుతుంది. పూత దశలో నీటి తడులు ఇవ్వరాదు. ఎకరాకు 10-12 కిలోల విత్తనాలు నాటాలి. పచ్చిరొట్టె దున్నిన పొలంలో పెసర పంట వేస్తే ఎరువుల అవసరం ఎక్కువగా ఉండదు.
- వరి పంట తరువాత అదే చేనులో పంట వేసుకోవచ్చు. పెసర పైరు 25-30 రోజుల వయసులో ఉన్నప్పుడు ఎకరాకు 10-15 కిలోల యూరియా వేయాలి.
- పెసర పంటలో ఎంజీజీ 295, ఎంజీజీ 351, టీఎం-96, ఎంజీజీ 348, ఎంజీజీ 42, డబ్ల్యూ జీజీ 37, ఎల్‌జీజీ 407, ఎల్‌జీజీ 450, ఎల్‌జీజీ 460 తదితర రకాలు చౌడు లేని భూములకు అనుకూల రకాలు. ఆయా రకాలు ఎకరాకు 8 క్వింటాల వరకు దిగుబడి వస్తుంది.



భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్

పిచికారీ విధానం

- పిల్లపురుగు అధికంగా ఉంటే క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా థయోగికార్బ్ 1 గ్రాం లేక ఎసిఫేట్ 1 గ్రాం చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పంటలో గూళ్లు కనిపిస్తే లీటరు నీటికి ఎసిఫెట్ 1.5 మిల్లీలీటర్లు లేదా నోవాల్యురాన్ 0.75 మిల్లీలీటర్ల మందుతో 1 మిల్లీలీటర్ డైక్లోరోవాస్‌ను కలిపి పైరుపై పిచికారీ చేయాలి.
- పురుగు ఉధృతి అధికంగా ఉంటే స్పైనోసాడ్ 0.4 మిల్లీలీటర్లు లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా ఫ్లూబెండ్మైడ్ 0.3 మిల్లీలీటర్ చొప్పున కలిపి పంటపై పిచికారీ చేయాలి.
- పొగాకు లద్దె పురుగు ఆశిస్తే నివారణ కోసం మోనోక్రోటోపాస్ 1.5 మిల్లీలీటర్ లేదా క్లోరిపైరిఫాస్ 2.5 లీటర్‌లో నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- తెల్లదోమ తెగుళ్లతో మొక్క ఆకులు, కాయల మీద పసుప పచ్చ పొడలు ఏర్పడుతాయి. నివారణకు లీటరు నీటిలో 1.6 మిల్లీలీటర్ మోనోక్రోటోపాస్ లేదా 2 మిల్లీలీటర్ డైమిథోయేట్ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్లు, నివారణ

పంటకు తెగుళ్ల బెడద అధికంగా ఉంటుంది. మారుక మచ్చ పురుగు లేదా గూడు పురుగు, బూజు పురుగు అని పిలుస్తారు. ఈ రకం పిల్ల పురుగులు పువ్వు మొగ్గలోకి చొచ్చుకపోయి లోపలి భాగాలను తింటాయి. తరువాత దశలో లేత ఆకులను పిందెలు, కాయలను కలిపి గూడుగా చేసుకుంటాయి. కాయ అడుగు భాగాన చిన్న రంధ్రం చేసి లోపలికి చొరబడి కాయలోని గింజలను తిని దానిని డొల్లగా మారుస్తాయి. గూడు లోపల ఉంటూ లోపలి పదార్థాలను తినడం వల్ల పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. అందుకని పూత దశలో పంటకు ఐదు శాతం వేప గింజల కషాయం లేదా 5 మిల్లీలీటర్ల వేప నూనెను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల పురుగులు గుడ్లను పెట్టకుండా నివారించవచ్చు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని హోటల్స్, రెస్టారెంట్స్‌లో నాణ్యతలేని ఆహారం విక్రయిస్తున్నా పట్టించుకోని ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో ఏవో పరమేష్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ జిల్లాలోని హోటల్స్, బార్ రెస్టారెంట్స్‌లో ఆహార నాణ్యతను పరిశీలించడంలేదని ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పట్టించుకోకపోవడం సరైందికాదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు సాయి, శ్రీశైలం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయాల్లో భక్తుల సందడి

నారాయణఖేడ్: మండల పరిధిలోని హనుమాన్ ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. కొండాపూర్‌లో విశిష్ట చరిత్ర కలిగిన ప్రాచీన హనుమాన్ ఆలయంతో పాటు డోవూరులోని హన్‌మాన్ ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

నిమ్జ్ భూముల్లో పంటలు సాగు చేయొద్దు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని చీలపల్లి, ఎల్గోయి, చీలపల్లి తండా, బర్దిపూర్ గ్రామాల్లో నిమ్జ్ కోసం రైతుల నుంచి సేకరించిన భూముల్లో ఎలాంటి పంటలు సాగు చేయొద్దని తహసీల్దార్ సంజీవరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల రైతులు గమనించాలని సూచించారు.

విద్యాశాఖ మంత్రి లేకపోవడం విచారకరం

జిన్నారం(పటాన్‌చెరు): పాఠశాలలు ప్రారంభమైనా నేటికీ విద్యాశాఖమంత్రి లేకపోవడం విచారకరమని బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి ఉదయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంజయ్య సేవలు మరువలేనివి

సంగారెడ్డి టౌన్: ఎంఈఓ దండు అంజయ్య విద్యారంగానికి అందించిన సేవలు మరువలేనివని కలెక్టర్ క్రాంతి అన్నారు. సంగారెడ్డిలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సదాశివపేట ఎంఈఓ దండు అంజయ్య ఉద్యోగ విరమణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడి బయట ఉన్న ఎంతోమంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించి అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, డీఈఓ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పుస్తకాల పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠ్య పుస్తకాల పంపిణీ కొనసాగుతోంది. శనివారం వివిధ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఎమ్మార్సీకి వచ్చి పాఠ్య పుస్తకాలను తీసుకెళ్లారు. ఎంఈఓ మారుతి రాథోడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

కల్హేర్(నారాయణఖేడ్): మండల పరిధిలోని కృష్ణాపూర్ ఉన్నత పాఠశాల, సిర్గాపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాంమోహన్ రావు, ఉపాధ్యాయురాలు శాంతిబాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ దశరథ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1-10వ తరగతి వరకు సుమారు 16000 వేల పాఠ్యపుస్తకాలు రాగా విద్యార్థులకు పంపిణీ చేశామన్నారు.

ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేత

సంగారెడ్డి: టీచర్ పోస్టుల బదిలీల ప్రక్రియలో భాగంగా 15 మంది ఉపాధ్యాయులకు ఎలిజబుల్ సర్టిఫికెట్లను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్ శనివారం అందజేశారు. ఆయన వెంట ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

మార్డిలో వీధికుక్కల హల్‌చల్

కల్హేర్(నారాయణఖేడ్): మండల పరిధిలోని మార్డిలో వీధికుక్కలు రెచ్చిపోయాయి. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మరి కొందరిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. వీధికుక్కల సంచారాన్ని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఆర్థికసాయం

జోగిపేట(అందోల్): ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జెఎస్‌డబ్ల్యూ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్‌తో పాటు సిబ్బంది టేక్మాల్ గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.20 వేలు అందజేశారు. నివాళులర్పించినవారిలో ఆస్పత్రి సీనియర్ అసిస్టెంట్ రమేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ స్వరూప, హెడ్‌నర్సు సునంద, నర్సింగ్ ఆఫీసర్స్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

రేపు ఊరడమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

నారాయణఖేడ్: మనూరు మండల పరిధిలోని పుల్‌కుర్తి గ్రామంలో ఈ నెల 17వ తేదీన ఊరడమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవ జాతరను వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా జాతరకు సంబంధించి బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో కరపత్రాలకు గ్రామపెద్దలు పోతుల మహిపాల్‌రెడ్డి ప్రధాన అర్చకులు సిద్దయ్యస్వామిచే శనివారం పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలి రావాలని సూచించారు.

రోడ్డు పనులు ప్రారంభం

నారాయణఖేడ్: నిజాంపేట-నారాయణఖేడ్-బీదర్ 161బీ జాతీయ రహదారి విస్తరణ పనులను శనివారం ప్రారంభించారు. డబుల్ లేన్ రోడ్డు విస్తరణకు రూ.513 కోట్లు మంజూరయ్యాయి. మనూరు మండల పరిధిలోని పుల్‌కుర్తి వంతెన దాటాక జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో రెండు నెలల కిందటే విస్తరణ పనులు ప్రారంభమై శరవేగంగా కొనసాగుతున్నాయి. తాజాగా జూకల్ శివారులోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమీపం నుంచి రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న భారీ మర్రి వృక్షాల తొలగింపు పనులను చేపట్టారు.

గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

వట్‌పల్లి(అందోల్): గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని బీజేవైఎం జిల్లా కోకన్వీనర్ అరవింద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వట్‌పల్లి పోలీసులకు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి పనికి వచ్చే పశువులను క్రూరంగా వధించడం చట్టరీత్యా నేరమైనప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. బక్రీద్ పండగ సందర్భంగా ప్రతి ఏడాది గోవులను చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పశువుల రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్‌గౌడ్, బీజేవైఎం అధ్యక్షుడు పాండు ప్రశాంత్, రాజశేఖర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయండి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 168 దుకాణాల సముదాయం పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మార్కెట్ యార్డులో చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రైతులు, వ్యాపారులు మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అందుకు అనుగుణంగా దుకాణాల సముదాయాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ మూలంగా నిర్మాణ పనుల్లో జాప్యం ఏర్పడిందని, త్వరలోనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నెలవు తెల్లాపూర్ సర్కిల్



రేడియల్ రోడ్డు సర్కిల్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రానగర్ నుంచి తెల్లాపూర్ మార్గంలోని రేడియల్ రోడ్డుపై నిర్మించిన సర్కిల్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డుపై వాహనాల రద్దీ ఎక్కువగా లేకపోవడంతో వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు సర్కిల్ వద్ద స్పీడ్ బ్రేకర్లు, ఏర్పాట్లు చేసినప్పటికీ రోడ్డు ప్రమాదాలు తగ్గడం లేదని, రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు వెలగడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న కౌన్సిలర్, ఉపాధ్యాయులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల చేత అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎలీస్‌రాణి, ఉపాధ్యాయులు విజయ, రూప తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్



కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

కంది(సంగారెడ్డి: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి అన్నారు. కందిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టి బాలికల విద్యపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపన్యాస పోటీలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పలువురు అభినందించారు.

నాట్లకు సిద్ధంగా వరినారు



కల్హేర్(నారాయణఖేడ్): వర్షాకాలంలో వరిసాగు చేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలోని మధ్య తరహ ప్రాజెక్ట్ నల్లవాగు ఆయకట్టు కింద, చెరువులు, కుంటలు, బోరుబావుల వద్ద వరినాట్లు వేసే పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవల కురిసిన వర్షంతో వ్యవసాయ పనులను ప్రారంభించారు. కల్హేర్, కృష్ణాపూర్, మార్డి, బీబీపేట, పోచాపూర్, సుల్తానాబాద్, అంతర్‌గాం తదితర చోట్ల వరినారును సిద్ధం చేసి సాగుకు సమాయత్తమయ్యారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

- సంక్షేమ పథకాల అమలులో భాగస్వాములు కావాలి
- ఎంపీపీ అంజమ్మ



న్యాల్‌కల్: మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ గౌసొద్దీన్

న్యాల్‌కల్(జహీరాబాద్): సమష్టి కృషి, సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ అంజమ్మ, వైస్ ఎంపీపీ గౌసొద్దీన్ అన్నారు. ఎంపీపీ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో అందరూ భాగస్వాములు కావాలన్నారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరై ఏడాది గడుస్తున్నా నేటికీ లబ్ధిదారులకు ఎందుకు పంపిణీ చేయడంలేదని వైఎస్ ఎంపీపీ ప్రశ్నించారు. దీంతో స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి త్వరలోనే చెక్కులను అందజేస్తామని తెలిపారు. ఏఓ లావణ్య మాట్లాడుతూ రైతులకు సరిపడ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ కృష్ణ మాట్లాడుతూ మండల పరిధిలోని 36 పాఠశాలల మరమ్మతుల కోసం నిధులు మంజూరు కాగా 30 పాఠశాలల్లో పనులు పూర్తయినట్లు తెలిపారు. రోడ్ల మరమ్మతుల కోసం జహీరాబాద్ నియోజకవర్గానికి రూ.58 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సురేష్, అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి

జహీరాబాద్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వైస్ ఎంపీపీ రాములు అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అధ్వానంగా మారిన రోడ్ల మరమ్మతులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలన్నారు. విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామని ఏఈలు పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ నాగిరెడ్డి రాథోడ్, సభ్యులు నర్సింహులు, మైనొద్దీన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.